నమస్తే తెలంగాణ
# రంగారెడ్డి
I హైదరాబాద్, శనివారం 22 జూన్ 2024 RANGAREDDY





ఖరారు కాని రంగారెడ్డి జిల్లా వార్షిక రుణ ప్రణాళిక

ఏటా మే నెలలోనే ఖరారు.. కానీ, ఈసారి ఆలస్యం

బ్యాంకు రుణాల్లేక.. రైతులకు భారంగా మారిన సాగు

-ప్రైవేట్ వ్యాపారులపై ఆధారపడుతున్న రైతాంగం

-కేసీఆర్ హయాంలో లక్ష్యానికి మించి రుణాలు ఇచ్చిన బ్యాంకులు

## రుణ ప్రణాళికేదీ?

రంగారెడ్డి, జూన్ 21 (నమస్తే తెలంగాణ) : ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. విత్తనాలు, ఎరువులు కొందామంటే రైతుల చేతుల్లో చిల్లిగవ్వ లేదు. రైతు భరోసా జాడే లేదు. జిల్లా వార్షిక రుణ ప్రణాళిక ఇంకా ఖరారు కాలేదు. దీంతో బ్యాంకుల నుంచి రుణాలు రాక రైతులకు సాగు భారంగా మారింది. రుణమాఫీ అవుతుందన్న ఆశతో పంట రుణాలను దీర్ఘకాలికంగా చెల్లించకపోవడంతో రంగారెడ్డి జిల్లాలో చాలామంది రైతులు ఎన్‌పీఏ(నాన్ పర్‌ఫార్మింగ్ అసెట్స్) జాబితాలో చేరిపోయారు. విధిలేక రైతులు ప్రైవేట్ వ్యాపారులపై ఆధారపడాల్సిన దుస్థితి వచ్చింది.

**రుణాల కోసం ఎదురుచూపులు..**

రంగారెడ్డి జిల్లాలో వానకాలం సాగును రైతులు 4.45 లక్షల ఎకరాల్లో చేపట్టే అవకాశం ఉందని జిల్లా వ్యవసాయ శాఖ అంచనా వేస్తున్నది. పత్తి 1.76 లక్షల ఎకరాల్లో, వరి 1.38 లక్షల ఎకరాలు, మొక్కజొన్న 66వేల ఎకరాలు, మిగతా ఎకరా ల్లో జొన్న, పెసర్లు, కందులు, మినుములు, వేరుశనగ, ఆముదం తదితర పంటలను రైతాంగం సాగు చేయనున్నది. ఇప్పటికే రైతులు 53,971 ఎకరాల్లో వివిధ రకాల పంటలను సాగు చేస్తున్నారు. ఇందులో అత్యధికంగా 38 వేల ఎకరాల్లో పత్తిని వేశారు. అయితే విత్తనాలు, ఎరువుల కొనుగోలుకు రైతుల చేతుల్లో పైసలు లేవు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసాపై ఇప్పటివరకు ఎటువంటి అధికారిక ప్రకటన చేయలేదు. కేసీఆర్ హయాంలో రైతులకు ఠంచన్‌గా రైతుబంధు కింద ఎకరాకు రూ.5 వేల చొప్పున రైతులకు సీజన్ ఆరంభం నాటికే అందేవి. ఫలితంగా రైతులకు పెట్టుబడులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండే. బ్యాంకుల నుంచి సైతం ఇబ్బడిముబ్బడిగా రుణాలు అందేవి. గతేడాది పంట రుణాల లక్ష్యం 2,7 92.53 కోట్లు కాగా.. బ్యాంకులు లక్ష్యానికి మించి 3,550.61కోట్లను రైతాంగానికి అందించాయి. ప్రస్తుతం రైతుభరోసా రాక.. రుణ ప్రణాళిక ఖరారు కాక రైతులు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సిన పరిస్థితులు వచ్చాయని రైతాంగం ఆందోళన చెందుతున్నది.

**మే నెలలోనే చేయాల్సి ఉండగా..**

ఏటా మే నెలలో వార్షిక రుణ ప్రణాళిక ఖరారవుతుంది. వ్యవసాయ రంగంతోపాటు ఉపాధి, విద్య, గృహ నిర్మాణాలకు సంబంధించి బ్యాంకులు రుణాలను ప్రణాళికలో నిర్దేశిస్తాయి. బ్యాంకుల వారీగా వ్యవసాయ రంగానికి ఏ మేరకు రుణాలు ఇవ్వాలనేది ఈ ప్రణాళిక ద్వారా తెలుస్తుంది. ఈ ఏడాది వార్షిక రుణ ప్రణాళిక ఇంకా ఖరారు కాలేదు. ఈ ఏడాది ఎన్నికల నేపథ్యంలో కోడ్ అమల్లో ఉండడంతో వార్షిక రుణ ప్రణాళికను వెల్లడించేలేదని తెలుస్తున్నది. ఈ నెలాఖరులోపు ప్రణాళికను విడుదల చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. రుణాలను పునరుద్ధరించి ప్రస్తుత సీజన్‌కు కొత్త రుణాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నా రైతులు ముందుకు రావడం లేదని బ్యాంకర్లు చెబుతున్నారు. రుణమాఫీ అవుతుందనే కారణంతో రైతులు బ్యాంకులకు వెళ్లడంలేదు. పాత బాకీ చెల్లించి, తిరిగి రుణం పొందితే రుణమాఫీ అవుతుందో ? లేదో.. అన్న అయోమయంలో వారు ఉన్నారు.

**రుణమాఫీపైనే ఆశలు..**

కాంగ్రెస్ ప్రభుత్వం లోక్‌సభ ఎన్నికల సమయంలో ఆగస్టులోగా రుణమాఫీ ఉం టుందని ప్రకటించింది. దీనికి సంబంధించి ఇంకా మార్గదర్శకాలు విడుదల చేయకపోవడంతో ఎంతమందికి రుణమాఫీ అవుతుందన్న విషయమై సందిగ్ధత నెల కొన్నది. బ్యాంకుల్లో ఉన్న రుణాలను చెల్లించి, తిరిగి పంట రుణం పొందితే రుణమాఫీ వర్తిస్తుందా? లేదా..? అన్నదానిపై బ్యాంకర్లు కూడా స్పష్టత ఇవ్వడం లేదు. రుణమాఫీకి సంబంధించిన మార్గదర్శకాలు వస్తేనే రుణమాఫీపై మరింత స్పష్టత వస్తుందని అధికారులు పేర్కొంటున్నాయి. రైతులు కొత్తగా రుణాలు పొందేందుకు రుణమాఫీతో ముడిపడి ఉండడంతో అధిక వడ్డీలకు ప్రైవేట్ వ్యాపారుల వద్ద రుణాలు తీసుకుని ఆర్థికంగా చితికిపోవాల్సి వస్తున్నది. ఈ విషయంపై ప్రభుత్వం దృష్టిసారించాల్సిన అవసరం ఉందని రైతులు కోరుతున్నారు.

## 24 గంటలు అందుబాటులో ఉంటాం



వికారాబాద్ ఎస్పీ కె. నారాయణరెడ్డి

వికారాబాద్, జూన్ 21 : ఇటీవల జిల్లాకు బదిలీపై వచ్చిన ఎస్పీ కె. నారాయణ రెడ్డి శుక్రవారం వికారాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. నూతన ఎస్పీకి జిల్లా అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, డీటీసీ అదనపు ఎస్పీ మురళీధర్‌లు పుష్ప గుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎస్పీ నారాయణ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని పోలీస్ అధికారులందరం 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉంటామని తెలిపారు. గంజాయి ఇతర మత్తు పదార్థాల నివారణపై ప్రత్యేక దృష్టి పెడతామన్నారు. కార్యక్రమంలో డీఎస్పీలు శ్రీనివాస్ రెడ్డి, బాలకృష్ణారెడ్డి, కరుణసాగర్ రెడ్డి, జిల్లా వర్టికల్ ఇన్‌చార్జి డీఎస్పీ జానయ్య, ఏఆర్ డీఎస్పీ వీరేశ్, సిబ్బంది పాల్గొన్నారు. అంతకు ముందు అనంతపద్మనాభస్వామివారిని కుటుంబ సభ్యులతో కలిసి ఎస్పీ దర్శించుకున్నారు.



పదేండ్ల కేసీఆర్ పాలనలో 24 గంటలూ విద్యుత్తు సరఫరా చేయడంతో రైతులు వ్యవసాయాన్ని పండుగలా చేసుకున్నారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా పంటలు పండించుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిందే తడవుగా విద్యుత్తు కోతలు పెట్టడమే పనిగా పెట్టుకున్నది. దీంతో రైతులు నేడు నాణ్యమైన కరెంట్ లేక నానా అవస్థలు పడుతున్నారు. రైతులు పంట చేల వద్ద విద్యుత్తు కోసం రేయింబవళ్లు పడిగాపులు కాస్తున్నారు. ఏ నలుగురు రైతులు కలిసినా కరెంట్ కష్టాల గురించే మాట్లాడుకోవడం కనిపిస్తున్నది. నాణ్యత లేని విద్యుత్తు సరఫరాతో కొన్ని చోట్ల మోటర్లు కాలిపోతుండగా.. వాటిని బాగుచేసి చెప్పిన సమయానికి రైతులకు ఇవ్వలేకపోతున్నామని మెకానిక్‌లు చెబుతున్నారంటే కరెంట్ సరఫరా పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. తెలంగాణ రాకముందు పడిన ఇబ్బందులు మళ్లీ మొదలయ్యాయని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం సకాలంలో వర్షాలు కురవక అన్నదాత ఆకాశం వైపు చూసే పరిస్థితి ఉన్నది. ఈ తరుణంలో పలువురు రైతులు మాట్లాడుతూ 'కేసీఆర్ హయాంలోనే కరెంట్ బాగుండే. ముచ్చటగా మూడు పంటలు సాగు చేసేటోళ్లం.. కాంగ్రెస్ తీరు రైతులను మళ్లీ అప్పుల ఊబిలోకి నెట్టింది. ఎప్పుడు కరెంటు వస్తుందో.. ఎప్పుడు పోతుందో అర్థం కాని పరిస్థితులున్నాయి' అని వాపోతున్నారు. నిరంతర విద్యుత్తు సరఫరాతో రైతు మోములో ఆనందం నింపిన కేసీఆర్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం అనుమానించడం సరైందికాదని రైతులు సూచిస్తున్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చలేక.. పాలన చేతగాకే రేవంత్ సర్కారు అవాస్తవాలను ప్రచారం చేస్తున్నదని మండిపడితున్నారు.

- న్యూస్ నెట్‌వర్క్ (నమస్తే తెలంగాణ), జూన్ 21

# కేసీఆర్ పాలనలోనే సాగు సంబురం..

## నిరంతర విద్యుత్తుతో ఏడాదికి మూడు పంటలు పండించేవాళ్లం

### తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం..



చీటికీమాటికి విధిస్తున్న కరెంట్ కోతలతో ఇబ్బందులు పడుతున్నాం. కేసీఆర్ పాలనలో రెప్పపాటు కూడా కరెంట్ పోయేది కాదు. ఆరు నెలల్లో కాంగ్రెస్ సర్కార్ ప్రజలకు చుక్కలు చూపిస్తున్నది. నిరంతర విద్యుత్తు ప్రజలకు అందించిన కేసీఆర్‌పై కక్ష సాధింపునకు పాల్పడడం అమానుషం. దీన్ని యావత్ తెలంగాణ సమాజం ఖండిస్తున్నది.

– ఎ.గోవర్ధన్, కమ్మెట గ్రామం, చేవెళ్ల మండలం

### చీటీకిమాటికి కరెంట్ పోతుంది



తెలంగాణ వచ్చిన తర్వాత కేసీఆర్ పాలనలో పదేండ్లుగా గృహాలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా నిరంతర విద్యుత్ ఇవ్వడం వల్ల అందరికీ ఉపయోగంగా ఉన్నది. ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో కొద్దిపాటి చినుకులు పడినా, గాలి దుమ్ము వచ్చినా విద్యుత్ అంతరాయం ఏర్పడుతున్నది. రాష్ట్రం ఏర్పడక ముందు మోటర్ల వద్ద రైతులు కాపలా ఉండేవారు. కానీ కేసీఆర్ హయాంలో ఆ పరిస్థితి మారి నిరంతరం విద్యుత్తు సరఫరా అయ్యేది. ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో రైతులకు పాత పరిస్థితులు వచ్చాయి.

–జంతుక అల్లాజీ, జంగారెడ్డిపల్లి, ఆమనగల్లు మున్సిపాలిటీ


కాంగ్రెస్ రాకతోనే కరెంట్ కష్టాలు షురూ..

ఎడాపెడా కోతలతో ఎకరం కూడా పారని దుస్థితి

హస్తం పార్టీ తీరుతో మళ్లీ అప్పులపాలవుతున్నాం

సుపరిపాలన చేతగాకనే కేసీఆర్‌ను బద్నాం చేస్తుండ్రని మండిపడుతున్న రైతాంగం

### పదేండ్ల కిందటి రోజులొచ్చినయ్..



ప్రస్తుతం పదేండ్ల కిందటి రోజులు మళ్లీ వచ్చాయి. కరెంటు ఎప్పుడు పడితే అప్పుడు పోతున్నది. కేసీఆర్ సీఎం అయిన తర్వాత కరెంటు పోతదనే ఆలోచన లేకుండా చేసిండు. కార్పెంటర్, విండోస్, డోస్ ఫిట్టింగ్ చేసేందుకు కరెంట్‌ను ఎక్కువగా ఉపయోగిస్తుంటాం. కరెంట్ లేకపోతే ఎక్కడి పని అక్కడే ఆగిపోతుంది. పదేండ్ల కిందట కరెంట్ లేక పని మానుకుని ఖాళీగా కూర్చునేటోళ్లం.. ప్రస్తుతం కాంగ్రెస్ పాలనలో కరెంటు కోతలతో పనులు సాఫీగా సాగడం లేదు.

–సాయికుమార్, వ్యాపారి, వికారాబాద్

### ఎడాపెడా విద్యుత్తు కోతలు..



గత ఆరు నెలల నుంచి విద్యుత్తు సరఫరాలో తీవ్ర అంతరాయం కలుగుతున్నది. ఎడాపెడా కోతలతో తెలంగాణ రాష్ట్రం రాకముందు పరిస్థితులు మళ్లీ గుర్తుకొస్తున్నాయి. చిన్నపాటి వర్షం, గాలి వచ్చినా సరఫరా నిలిపివేస్తున్నారు. ప్రజల అవసరాలతో ప్రభుత్వానికి పని లేదు. విద్యుత్తు విషయంలో కేసీఆర్‌పై బురద జల్లే ప్రయత్నాలు రేవంత్ సర్కార్ మానుకోవాలి

– కొల్లగల్ల భాస్కర్, ఈర్లపల్లి గ్రామం, చేవెళ్ల మండలం


### బీఆర్ఎస్ హయాంలోనే కరెంటు బాగుండేది..



సమైక్య పాలనలో కరెంటు సక్రమంగా ఉండకపోయేది. ఎప్పుడుపడితే అప్పుడే పోయేది. పని చేసుకుందామంటే కుదరకపోయేది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక కేసీఆర్ కృషితో 24 గంటలూ కరెంట్ ఉండేది. రైస్ మిల్లు నిరంతరం నడవడంతో వ్యాపారం బాగుండేది. ప్రస్తుతం రోజుకు రెండు, మూడు సార్లు కరెంట్ పోతున్నది. దీంతో రైస్ మిల్లులో పనులు ఆలస్యమవుతున్నాయి. పదేండ్లుగా ఎలాంటి కరెంటు సమస్య లేకుండా చేసిన కేసీఆర్ సారుపై కాంగ్రెస్ సర్కార్ నిందలేయడం సరికాదు. ప్రస్తుతం కరెంట్ కోతలతో ఇబ్బందులకు గురవుతున్నాం. – సురేశ్, రైస్ మిల్ నిర్వాహకుడు, వికారాబాద్

# 6 లక్షల మొక్కలు సిద్ధం

- ఈ ఏడాది వనమహోత్సవంలో అడవుల్లో మొక్కలు నాటేందుకు ప్రాధాన్యం
- జిల్లాలోని 518 ఎకరాల అటవీ ప్రాంతంలో మొక్కలు నాటడమే లక్ష్యం
- జిల్లాలోని వికారాబాద్, ధారూరు, పరిగి, తాండూరు, కొడంగల్ రేంజ్ పరిధిలో మొక్కలు నాటనున్న అటవీ శాఖ యంత్రాంగం
- జిల్లాలోని అటవీ శాఖ నర్సరీల్లో సరిపడా మొక్కలు
- జిల్లాలోని అటవీ ప్రాంతంలో 12.07 శాతం మేర పచ్చదనం



వికారాబాద్, జూన్ 21, (నమస్తే తెలంగాణ): జిల్లాలోని అటవీ ప్రాంతాల్లో పచ్చదనం పెంపొందించడంపై జిల్లా అటవీ శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ప్రతి ఏడాది ఎంతో కొంతమేర అటవీ ప్రాంతంలో మొక్కలు నాటుతున్న అటవీ శాఖ యంత్రాంగం ఈ ఏడాది అధిక మొత్తంలో మొక్కలను నాటాలని నిర్ణయించింది. జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది 518 ఎకరాల్లోని అటవీ ప్రాంతంలో వనమహోత్సవంలో భాగంగా టేకు మొక్కలతోపాటు చైనా బాదం, కానుగ, నెమలి నార తదితర మొక్కలను నాటాలని అధికారులు నిర్ణయించారు. జిల్లాలోని అటవీ శాఖ ఐదు రేంజ్‌ల పరిధిలోని అటవీ ప్రాంతంలోని ఖాళీలను అధికారులు ఇప్పటికే గుర్తించారు. ఈ ఏడాది వన మహోత్సవంలో భాగంగా 5 లక్షల మొక్కలను నాటాలని లక్ష్యంగా నిర్దేశించగా, అటవీ శాఖ ఆధ్వర్యంలోని 15 నర్సరీల్లో 6 లక్షల మొక్కలు నాటేందుకు అందుబాటులో సిద్ధంగా ఉంచారు.

**518 ఎకరాల్లోని అటవీ ప్రాంతంలో..**


ఈ ఏడాది వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని అనంతగిరి అటవీ ప్రాంతంలోతోపాటు మిగతా అన్ని అటవీ ప్రాంతాల్లోని ఖాళీలను గుర్తించి సంబంధిత ఖాళీల్లో ఔషధ మొక్కలను నాటనున్నారు. జిల్లావ్యాప్తంగా వికారాబాద్, పరిగి, తాండూరు, ధారూరు, కొడంగల్ రేంజ్‌ల పరిధిలోని 518 ఎకరాల్లో మొక్కలు నాటాలని నిర్ణయించారు. జిల్లాలోని ఐదు రేంజ్‌ల పరిధిలోని అటవీ ప్రాంతాల్లో మొక్కలను నాటనున్నారు. తాండూరు అటవీ శాఖ రేంజ్ పరిధిలోని అడికిచెర్ల, జిన్‌గుర్తి, నాగులపల్లి, మైల్వార్, అంతారం, కల్కొడ, బంట్వారం, తట్టేపల్లి, గొట్టిగ, కొప్పన్‌కోట్ పరిధిలోని అటవీ ప్రాంతాల్లో, పరిగి ఫారెస్ట్ రేంజ్ పరిధిలో ఇబ్రహీంపూర్, మిట్టాకోడూర్, తిర్మలాపూర్, పీరంపల్లి, కొత్తపల్లి, అనంతసాగర్, రంగంపల్లి, ఇప్పాయిపల్లి, మహ్మదాబాద్, నస్కల్ పరిధిలోని అటవీ ప్రాంతాల్లో, కొడంగల్ ఫారెస్ట్ రేంజ్ పరిధిలో అప్పాయిపల్లి, బొంరాస్‌పేట, తుంకిమెట్ల, మెట్లకుంట, దుద్యాల్, దౌల్తాబాద్, కొత్తూరు, గుండెపల్లి, రేగడిమైల్వార్ పరిధిలోని అటవీ ప్రాంతాల్లో, వికారాబాద్ ఫారెస్ట్ రేంజ్ పరిధిలో పులుమామిడి, మోత్కుపల్లి, ఎక్‌మామిడి, దుర్గంచెరువు, మున్నూరుసోమారం, బుగ్గ ఆలయం, వెల్చాల్, నాగసాన్‌పల్లి, తిప్పాపూర్, అనంతగిరి, మన్నెగూడ పరిధిలోని అటవీ ప్రాంతాల్లో, ధారూరు ఫారెస్ట్ రేంజ్ పరిధిలో అల్లాపూర్, ధారూరు, చింతకుంట, రేగొండి, కొండాపూర్, నాగసముందర్, దోర్నాల్ పరిధిలోని అటవీ ప్రాంతాల్లో మొక్కలను నాటనున్నారు. అటవీ ప్రాంతాల్లో నెమలినార, నారవేపి, బూరుగ, కానుగ, రావి, అల్లనేరేడు, మర్రి, చింత, జువ్వి, ఇప్పా, నారవేప, ఎర్రచందనం, శ్రీగంధం, వేప, ఏరుమద్ది, చిందుగ, సీతాఫల్, ఉసిరి, మారేడు తదితర మొక్కలను నాటనున్నారు. గతంలో కబ్జాకు గురైన అటవీ భూముల్లోనూ మొక్కలను నాటేందుకు జిల్లా అటవీ శాఖ అధికారులు సిద్ధమయ్యారు. కొన్ని ప్రాంతాల్లో కబ్జాదారులు అడ్డుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ ఎట్టిపరిస్థితుల్లో మొక్కలు నాటేలా అధికారులు చర్యలు చేపట్టారు.

**లక్ష్యం 29.33 లక్షల మొక్కలు...**

వనమహోత్సవంలో భాగంగా జిల్లావ్యాప్తంగా 2024–25 ఆర్థిక సంవత్సరానికిగాను 29.33 లక్షల మొక్కలను నాటాలని జిల్లా యంత్రాంగం లక్ష్యంగా నిర్ణయించింది. శాఖల వారీగా నిర్దేశించిన లక్ష్యానికి సంబంధించి విద్యాశాఖ–11 వేలు, పశుసంవర్ధక శాఖ–5 వేలు, ఉద్యానవన శాఖ 2 లక్షలు, పరిశ్రమల శాఖ– 10 వేలు, అటవీ శాఖ ఆధ్వర్యంలో 3.50 లక్షలు, డీపీవో–డీఆర్‌డీవో ఆధ్వర్యంలో 18 లక్షల మొక్కలు, గనుల శాఖ అధ్వర్యంలో 50 వేల మొక్కలు, పౌరసరఫరాల శాఖ–2 వేలు, ఎక్సైజ్ శాఖ–15,000 మొక్కలు, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 2.50 లక్షల మొక్కలు, మార్కెటింగ్ శాఖ–500 మొక్కలు, పోలీస్ శాఖ ద్వారా 10 వేల మొక్కలు, నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో 5 వేలు, రోడ్లు, భవనాల శాఖ ఆధ్వర్యంలో 500 మొక్కలు, జిల్లా సంక్షేమాధికారి ఆధ్వర్యంలో 1000 మొక్కలు, తాండూరు మున్సిపాలిటీలో 60 వేల మొక్కలు, వికారాబాద్ మున్సిపాలిటీలో 70 వేల మొక్కలు, కొడంగల్ మున్సిపాలిటీలో 50 వేల మొక్కలు, పరిగి మున్సిపాలిటీలో 43 వేల మొక్కలను నాటాలని నిర్ణయించారు. ముఖ్యంగా టేకు, ఉసిరి, జామ, నిమ్మ, సీతాఫల్, దానిమ్మ, పప్పాయ, మునగ, కానుగ, నెమలినార, శ్రీగంధం తదితర మొక్కలను నాటనున్నారు. గ్రామాల్లో జామ, కరివేపాకు, దానిమ్మ, పప్పాయ, పూల మొక్కలైన గులాబీ, మందారం, మల్లె మొక్కలను నాటనున్నారు.

**అటవీ ప్రాంతంలో పచ్చదనాన్ని పెంచేందుకు చర్యలు**
**– డీఎఫ్‌వో జ్ఞానేశ్వర్**

జిల్లాలోని అటవీ ప్రాంతాల్లో పచ్చదనాన్ని మరింత పెంచే చర్యల్లో భాగంగా జిల్లాలోని అటవీ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున మొక్కలు నాటేందుకు నిర్ణయించామని జిల్లా అటవీ శాఖ అధికారి జ్ఞానేశ్వర్ తెలిపారు. ఎక్కడైతే చెట్లు లేకుండా ఖాళీగా ఉన్న ప్రాంతంలో వీలైనన్ని ఎక్కువ మొక్కలు నాటడంపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. అటవీ భూములను కబ్జా చేసిన ప్రాంతాల్లోనూ మొక్కలను నాటేందుకు చర్యలు చేపట్టామన్నారు. ప్రస్తుతం జిల్లాలోని అటవీ ప్రాంతంలో 12.07 శాతం మేర పచ్చదనం ఉన్నదని వెల్లడించారు. జిల్లాలో హరితహారంలో భాగంగా నాటే ప్రతి మొక్కను సంరక్షించేందుకు తగు చర్యలు చేపట్టామన్నారు.



## ఆరోగ్యానికి యోగా..

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం తన నివాసంలో రాష్ట్ర శాసనసభ స్పీకర్, వికారాబాద్ నియోజకవర్గం ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్ కుమార్ ప్రాణాయామం యోగా చేశారు. ఆరోగ్యవంతమైన జీవితం కోసం నిత్యం ఉదయం వేళలో యోగా చేయాలని సూచించారు. - వికారాబాద్, జూన్ 21